

ఐడీపీఎల్ రోడ్డులోని ఎర్రగోడల సమీపంలో ఇలా..

పచ్చని చెట్లపై

గొడ్డలి వేటు

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు కొనసాగుతూనే ఉంది. ఒక పక్క పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలను నాటాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. మరో పక్క ఇళ్లకు అడ్డుగా ఉన్నాయని కొందరు నిర్మాణదారులు, మరో వైపు తీగులకు అడ్డుగా ఉన్న చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది మోడులుగా మారుస్తున్నారు. హరితహారం పేరిట ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం వందలాది కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. లక్షలాది మొక్కలను నాటుతున్నా మరో వైపు అదే స్థాయిలో చెట్ల నరికివేత కొనసాగుతుండటం గమనార్హం. ఇప్పటికైనా విచక్షణారహితంగా చెట్లను నరికివేస్తున్న వారిపై సర్కిల్ అధికారులు కఠినంగా వ్యవహరిస్తే తప్ప పర్యావరణ పరిరక్షణ సాధ్యపడదని పలువురు పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

– రంగారెడ్డినగర్



సంజయ్‌గాంధీనగర్‌లో..

కుత్బుల్లాపూర్ రామకృష్ణనగర్‌లో..



రంగారెడ్డినగర్‌లో..

క్లుప్తంగా

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి



నిజాంపేట్: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పోరాటాలతోనే పరిష్కరించుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ సీఐటీయూ అధ్యక్షుడు వెంకట రాజ్యం అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం నేపథ్యంలో మంగళవారం ఆయన నిజాంపేట్ కార్పొరేషన్ వద్ద కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటరాజ్యం మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయకుండా, జీతాలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం మభ్య పెడుతూ వస్తోందన్నారు. చలో హైదరాబాద్ నిరసనలో పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మ, శ్రీను, విజయ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్

కుత్బుల్లాపూర్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వకుండా పేదలను తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్‌నగర్‌లో మంగళవారం ఆయన ఇంటింటికీ కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కుత్బుల్లాపూర్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రెసిడెంట్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జ్ రాధాకృష్ణ, జిల్లా కిసాన్ అధ్యక్షుడు సదానందం, నాయకులు రహీం, భీమ్‌రావు, సురేష్, ఖాజాబాయ్, అరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి

కుత్బుల్లాపూర్: తెలంగాణాలో వైఎస్సార్‌టీపీ అధికారంలోకి వస్తేనే రైతాంగం సమస్యలు తీరుతాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వైఎస్సార్‌టీపీ ఇన్‌చార్జ్ దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే 24 గంటల ఉచిత కరెంట్‌ను ఆపేసి 8 గంటలు ఇస్తామనడం తెలంగాణ రైతులను నిరుత్సాహ పరచడమేనన్నారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబు మనిషి అనడానికి ఇటువంటి శ్యాఖ్యలే నిదర్శనమన్నారు. తక్షణమే రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరి ఎంపీగా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి బాధ్యత యూతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

సుభాష్‌నగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించినప్పుడే పది కాలాలపాటు పటిష్టంగా ఉంటాయని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సూరారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో రూ.48 లక్షలతో జరుగుతున్న సీసీరోడ్డు పనులను బస్తీవాసులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

కుత్బుల్లాపూర్‌లో ఒక్క రేషన్‌కార్డు

ఇవ్వలేదు

- నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 45వేల రేషన్‌కార్డులు ఇప్పించా
- ఇప్పటికైనా మేల్కొని రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియను ప్రారంభించాలి
- స్పందించకుంటే ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసనకు దిగుతాం
- జీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హెచ్చరిక

ఇది ఎమ్మెల్యే వివేకానంద్ చేతకాని తనానికి నిదర్శనం

కుత్బుల్లాపూర్: పేద కుటుంబాలకు రేషన్‌కార్డులు జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో బాలానగర్‌లోని సహాయ పౌరసరఫరాల శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం బాలనగర్ ఏఎస్ఓ నందిని వినతి పత్రం అందజేశారు.

ఇతర పథకాలు రావొద్దనే దురుద్దేశంతోనే రేషన్‌కార్డులు ఇవ్వడం లేదు..

పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను పేదలకు రాకుండా చేయాలనే దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదని విమర్శించారు. తాను పాదయాత్ర చేస్తున్న సమయంలో అనేక మంది రేషన్‌కార్డు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఇకనైనా ఈ ప్రభుత్వం మేల్కొని రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఇందిరాపార్కు వద్ద భారీ ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

◆ ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేకే శేఖర్ యాదవ్, చండీ శ్రీనివాస్, పత్తి రఘుపతి, ఏరువ వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు బావిగడ్డ రవి, గరిగే శేఖర్ ముదిరాజ్, జిల్లా నాయకులు మేకల సురేష్ రెడ్డి, జగన్మోహన్‌రావు, నిజాంపేట్ మున్సిపల్ అధ్యక్షుడు ఆకుల సతీష్, డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, రాజేశ్వర్‌రావు, దుర్యోధన్ రావు, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అరకల సుధా, అసెంబ్లీ కో కన్వీనర్ అలివేలు, నాయకులు రాజిరెడ్డి, బిల్లా వెంకటేష్, భానుచందర్, సునీల్ పాటిల్, హనుమాన్ కచవా, గుబ్బల లక్ష్మీనారాయణ, విజయ్ గుప్తా, నర్సింగరావు, గుమస్తా మధుసూదన్, నరేష్ గౌడ్, జూల సందీప్, చిలుక, షాకీర్, తోకల శీను, సంతోష్, శ్రీకాంత్, నర్సింహాచారి, ఉప్పల రవి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలానగర్ సహాయ పౌర సరఫరాల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కూన శ్రీశైలంగౌడ్



బాలానగర్ పౌర సరఫరాల శాఖ ఏఎస్ఓ నందినికి వినతి పత్రం అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

'వన్ నేషన్ - వన్ రేషన్' రాష్ట్రంలో అమలు చేయాలి

ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 45వేల రేషన్‌కార్డులు ఇప్పించానన్నారు. తొమ్మిదేళ్లగా కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు కాకపోవడంలో ప్రస్తుత ఎమ్మెల్యే చేతగానితనం బహిర్గతమవుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకొచ్చిన వన్ నేషన్ - వన్ రేషన్ పథకాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'కథ చెబుతారా.. ఊ కొడతాం..' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు

కుత్బుల్లాపూర్: తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన హిందూ ధర్మ ప్రచార పరిషత్ మేడ్చల్ – మల్కాజ్‌గిరి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న కుత్బుల్లాపూర్‌లోని శివ విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో 'కథ చెబుతారా.. ఊ.. కొడతాం.. కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం టీటీడీ ప్రోగ్రాం కో.ఆర్డినేటర్ హరినాథ్, టీటీడీ ధర్మాచార్య పసుపులేటి నరేంద్ర కృష్ణ పాఠశాలను సందర్శించి ప్రోగ్రామ్‌కు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల్లో సృజనాత్మకతను, ఆలోచనలను రేకెత్తించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పదేళ్ల లోపు, 10–15 ఏళ్లలోపు పిల్లలకు కథల పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పవన్‌కుమార్, సాయివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటా



దుండిగల్: భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటానని బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని సాయిబాలాజీ ఎంక్లేవ్‌లోని నిర్మాణంలో ఉన్న అపార్టమెంట్‌లో సోను కుమార్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. కాగా ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న కృష్ణ బిల్డర్ ప్రసాద్‌తో మాట్లాడి రూ.3 లక్షల చెక్కును మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మారావు, అనంత స్వామి, మాదాసు వెంకటేశం, ఆంజనేయులు, హన్మంతరావు తదితరులు ఉన్నారు. అదే విధంగా బోనాల పండుగ సందర్భంగా మల్లంపేట, మహేశ్వరం గ్రామాల ప్రజలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


క్రైం కార్నర్..

విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



కుత్బుల్లాపూర్: విద్యుదాఘాతంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలోని సెయింట్ ఆంథోనీస్ సమీపంలోని ఓ ఇంటి సోలార్ ఫెన్సింగ్ తాకడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సదరు ఇంట్లో నివాసముంటున్న సునీత అనే మహిళ అలికిడి కావడంతో బయటికి వచ్చి చూడగా ఓ వ్యక్తి గోడ అవతల అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందాడని నిర్ధారించారు. కాంపౌండ్ వాల్‌ను దూకే క్రమంలో సోలార్‌ఫెన్సింగ్ షాక్‌కు గురై మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కాగా మృతుని వివరాలు ఏమీ తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య



నందిని

సుభాష్‌నగర్: పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం లాల్‌సాహెబ్‌గూడకు చెందిన ముదావత్ కిషన్, మరోనీల కుమార్తె నందిని (19) మహబూబ్‌నగర్‌లో పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నందిని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికే ఆమె మృతి చెందింది. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: ఐడీఏ జీడిమెట్ల సెక్షన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారి ఏఈ టి.వెంకటనారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల ఎస్ఎస్4 పరిధిలోని అయిమాతా టెంపుల్, భాగ్యలక్ష్మి కాలనీ సుభాష్‌నగర్‌లలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రగతినగర్ సెక్షన్ పరిధిలో..

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ భౌరంపేట్ గ్రామం, జెఎన్ఎన్‌యుఆర్ఎం ఫీడర్ల పరిధిలో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుత్బుల్లాపూర్ సెక్షన్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: ఫీడర్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడనుందని కుత్బుల్లాపూర్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వాజ్‌పేయినగర్, నాగులగుట్ట, బాపునగర్, పద్మానగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

11 కేవీ ధోలారీధనీ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనందని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. పోచమ్మగడ్డ, సాయికృపా అపార్ట్‌మెంట్స్, దోలారీధనీ, కొంపల్లి శ్మశాన గడ్డ, ఎస్ఎన్ఆర్, చంద్రారెడ్డి గార్డెన్స్, శ్రీకాంత్‌నర్సరీ, హార్లిక్స్ ఫ్యాక్టరీ వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అఖిలపక్ష నేతలతో రిటర్నింగ్ అధికారి సమీక్ష



వివిధ రాజకీయ పక్షాలతో సమావేశమైన ఎన్నికల అధికారి మంగతాయారు

కుత్బుల్లాపూర్: ఓటర్ లిస్టులో పేర్ల తప్పుల తడకలు, నూతన ఓటర్ల నమోదు తదితర విషయాలపై కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగతాయారు మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. బూత్ లెవెల్ అధికారులు కేవలం ఓటర్ లిస్టును పట్టుకొని తిరుగుతున్నారు తప్ప వాస్తవాలను గ్రహించలేకపోతున్నారని పలు పార్టీల నాయకులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఒక్క ఇంట్లో ఆరు ఓట్ల కంటే ఎక్కువగా ఉన్న వాటిని పరిశీలించాల్సిన అవసరం ఉన్నా పట్టించుకోవడంలేదన్నారు. చాలా ప్రాంతాల్లో ఓట్లు గల్లంతు అవుతున్నాయని వాటిని పరిశీలించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లతో పాటు వివిధ పక్షాల నేతలు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ జరిగే రోజు దగ్గర్లోనే ఉంది'



చలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

కుత్బుల్లాపూర్: మాదిగ, మాదిగ ఉపకులాలు చలో వరంగల్ సభకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జనరల్ సెక్రటరీ సిలువేరు శ్రీనివాస్‌మాదిగ కోరారు. మంగళవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో సభకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగతో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చర్చించారన్నారు. ఢిల్లీకి రావాల్సిందిగా ఆహ్వానించారన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లో జాతీయస్థాయి, అనుబంధ సంఘాల నాయకులు సమావేశం కానున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ మాదిగ, నర్సింహులు, సలోని మాదిగ, పరశురామ్ మాదిగ, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

'దుండిగల్ మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది'



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్ పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్ 21వ వార్డులో మంగళవారం రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ.రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కృష్ణవేణి మాట్లాడుతూ ఇప్పటికే మెజార్టీ స్థాయిలో పనులను పూర్తి చేశామన్నారు. అనంతరం వార్డులో పర్యటించి ప్రజా సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు అనంత స్వామి, శంభీపూర్ క్రిష్ణ, మాదాస్ వెంకటేష్, ఎంబరి లక్ష్మి, ఆంజనేయులు, హనుమంత్ రావు, మున్సిపల్ మహిళ అధ్యక్షురాలు మనోజ, అమర్, 24, 21వ వార్డు ప్రెసిడెంట్లు రమేష్, మాదాస్ నవీన్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు ఇవ్వకుంటే ధర్నాకు దిగుతాం



మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ నాయకుడు దొర అరుణ్

సుభాష్‌నగర్: ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘోరంగా విఫలమయ్యారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకుడు దొర అరుణ్ అన్నారు. మంగళవారం బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, ఒకేషనల్ కళాశాలను కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సందర్శించారు. వారు మాట్లాడుతూ.. కాలేజీ ఎఫిలియేషన్ పూర్తయి ఏడాది కావస్తున్నా ఉపాధ్యాయుల నియామకం జరగలేదన్నారు. కనీసం విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు లేవని పేర్కొన్నారు. పుస్తకాలు సైతం అందలేదన్నారు. అరకొర వసతులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పాఠ్య పుస్తకాలు అందించకుంటే భారీ ఎత్తు ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

భర్త తాగుడు మానడం లేదని భార్య ఆత్మహత్య

జీడిమెట్ల: ఎంత చెప్పినా భర్త మద్యం తాగడం మానివేయడం లేదని ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ వివరాల ప్రకారం.. చింతల్ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన నరేష్, లక్ష్మి(35) భార్యభర్తలు వీరికి ఐశ్వర్య(17), కార్తిక్(14) ఉన్నారు. నరేష్ కూరగాయల వ్యాపారం చేస్తూ వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ ఉండేవాడు. దీంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో పెద్దల మధ్య పంచాయితీ పెట్టిన ప్రతిసారి నరేష్ మద్యం తాగనని చెప్పి యథావిధిగా మద్యం సేవించేవాడు. మంగళవారం రాత్రి సైతం నరేష్ మద్యం సేవించి ఇంటికి రావడంతో వారు గొడవపడ్డారు. దీంతో విసుగు చెందిన లక్ష్మి మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి సోదరుడు హరీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సుపరిపాలన అందిస్తూ ముందుకు సాగుతున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్



మైసమ్మనగర్‌లో ప్రగతియాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సుపరిపాలన అందిస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా మంగళవారం ఆయన జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మైసమ్మనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, అంతర్గత రోడ్ల సమస్యలతో పాటు విద్యుత్ తీగలను మార్చాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులకు సూచిస్తూ వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈఈ గోవర్ధన్, డీఈఈ రూపాదేవి, మేనేజర్ అంకిత్ తదితరులు ఉన్నారు.

రూ.2.5లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..

బాచుపల్లి రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇటీవల చికిత్స పొందాడు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎంరిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ.2.50 లక్షలు మంజూరు చేసింది. సదరు చెక్కును చింతల్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రసాద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

రేణుకాఎల్లమ్మకు పూజలు..

మల్లంపేట్ గ్రామం ఇందిరమ్మ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపా కటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.